

రికార్డు స్థాయిలో..

- జిల్లాలో తొలిరోజు 94శాతం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పంపిణీ చేసిన ఉద్యోగులు



గొల్లప్రోలులో వర్షంలోనే పింఛన్లు అందజేస్తున్న ఉద్యోగులు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 31: జిల్లాలో ఒకరోజు ముందుగానే శనివారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగింది. జిల్లాలో 94శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. 2,76,693 పింఛన్‌దారులు ఉండగా 2,58,846మందికి పంపిణీ జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు భారీవర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా జిల్లా అధికార యంత్రాంగం యుద్ధసైనికుల్లా కదిలి లబ్ధిదారులకు సొమ్ము అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలాలవారీగా.. శంఖవరం మండలంలో 89శాతం పంపిణీచేశారు. ఏలేశ్వరం మండలంలో 92శాతం, కిర్లంపూడి మండలంలో 92శాతం, పెద్దాపురం అర్బన్ 92శాతం పంపిణీ చేశారు. గొల్లప్రోలులో 92శాతం, ప్రత్తిపాడ 92శాతం, కాజులూరు 93శాతం, తొండంగి 92శాతం, జగ్గంపేట 93శాతం, రౌతులపూడి 93శాతం, సామర్లకోట 93శాతం, కరప 93శాతం, తుని అర్బన్ 93శాతం, ఏలేశ్వరం అర్బన్ 93శాతం, సామర్లకోట అర్బన్ 93శాతం, పిఠాపురం 93శాతం, తాళ్లరేవు 94శాతం, కాకినాడ రూరల్ 94శాతం, పెదపూడి 94శాతం, గొల్లప్రోలు అర్బన్ 94శాతం, పెద్దాపురం 94శాతం, కోటనందూరు 94శాతం, తుని 94శాతం, కాకినాడ అర్బన్ 95శాతం, గండేపల్లి 95శాతం, పిఠాపురం అర్బన్ 95శాతం పింఛన్ల పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,76,693 పింఛన్‌దారులు ఉండగా 2,58,846మందికి పంపిణీ జరిగింది.

నేటినుంచి రేషన్‌లో పంచదార, బియ్యంతోపాటు రాగులు

- ఈ నెలలోను కందిపప్పు లేనట్లే

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 31: జిల్లాలో ఉన్న ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి బియ్యంతోపాటు పంచదార సబ్సిడీపై ఇవ్వనున్నారు. గత ప్రభుత్వంలో కొంతకాలం పంచదార ఇచ్చి తర్వాత కోత విధించారు. దీనివల్ల అప్పట్లో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ ప్రకారం పంచదార సిద్ధం చేసింది. జిల్లాలో 1060 రేషన్ దుకాణాల్లో పంచదార పంపిణీ చేయాలని 254 మెట్రిక్ టన్నులు పంపిణీకి సిద్ధంగా చేశారు. బియ్యం 9400 మెట్రిక్ టన్నులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. రాగులు కూడా ఐదు టన్నులు పంపిణీ చేయడానికి ఉంచారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల నుంచే కందిపప్పు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా టెండర్ ఖరారు కాకపోవడంవల్ల ఇవ్వలేకపోతున్నామని అధికారులు వెల్లడించారు. ఏఏవై రేషన్‌కార్డులకు ఒక కిలో రూ.13.50కి పంచదార ఇస్తారు. తెల్లరేషన్ కార్డుదారులకు అరకిలో రూ.17కి పంచదార ఇస్తారు. సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఇస్తున్న పంచదారను లబ్ధిదారులు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారి ప్రసాద్, పౌరసరఫరాలశాఖ డీఎం బాలసరస్వతి తెలిపారు.

ఆదివారం ప్రత్యేకం

ఆహా.. అన్నవర ప్రసాదం



- అమృతం.. అన్నవరం ప్రసాదం
- 150 గ్రాములు రూ.20లు
- ఏటా 2 కోట్ల ప్యాకెట్లు విక్రయాలు
- ఆలయానికి రూ.40 కోట్ల ఆదాయం
- రుచి.. శుచిలో అద్భుతం
- గోధుమ రవ్వతో అదరహో
- బయటచేసినా రాని ప్రసాద రుచి
- రత్నగిరిపై 133 ఏళ్లుగా అదే ప్రసాదం
- తాజాగా ఎఫ్‌ఎస్ఎస్ఏఐ గుర్తింపు

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం :

అమృతం అంటే ఎలా ఉంటుందని ఎవరినైనా అడిగితే అన్నవరం ప్రసాదంలా ఉంటుందంటారు చాలామంది.. అడ్డాకులో వేడివేడిగా ఉండే ప్రసాదాన్ని ఒక్కసారి రుచి చూశారా వదిలిపెట్టరు.. ఎవరు పెడతానన్నా కాదనరు... నోట్లో ఇలా వేసుకుంటే అలా కరిగిపోతుంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చే మల్వరాజ్ గోధుమల ద్వారా తయారు చేసే ఈ ప్రసాదానికి మరేదీ సాటిరాదంటే అతిశయోక్తికాదు. ప్రసాదం తయారీలో రుచి, శుచికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. అందుకే తాజాగా భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఏఐ) గుర్తింపు లభించింది. ఇప్పటికే దీనికి 2019లో ఐఎస్‌వో 22000: 2005 గుర్తింపూ లభించింది. ఏటా రెండు కోట్లకుపైగా ప్యాకెట్లు అమ్ముడవడమే అన్నవరం ప్రసాదం రుచికి నిదర్శనం.

ప్రసాదం చరిత్రకు 133 ఏళ్లు..

అన్నవరం సత్యదేవుడి ఆలయం 1891లో ప్రతిష్ఠితమైంది. అప్పటి నుంచి భక్తులకు గోధుమ రవ్వ ప్రసాదాన్నే అందిస్తున్నారు. అన్నవరం ప్రసాదం అంటే భక్తులకు ఎంత ప్రీతిపాత్రమో చెప్పనక్కర్లేదు. ఉభయ గోదావరి జిల్లాల వాసులు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఎవరిని కలవడానికి వెళ్లినా సత్యదేవుడి ప్రసాదం తీసుకెళ్లి అందించడం సర్వసాధారణం. ప్రసాదంతో వెళితే తలచిన పని త్వరితగతిన పూర్తవుతుందనేది వారి నమ్మకం. ఎందుకంటే అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి నాణ్యత, రుచి, శుచిలో తిరుగులేదు.. భారత ఆహార ప్రమాణాల సంస్థ తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు నిచ్చింది. ఏటా రెండుకోట్లకుపైగా స్వామివారి ప్రసాదం ప్యాకెట్లను దేవస్థానం విక్రయిస్తోంది. ఒక్క ప్రసాదాల ద్వారా ఏటా రూ.40 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ గోధుమలు..

అన్నవరం ప్రసాదానికి అసలు అంత రుచి ఎక్కడి నుంచి వస్తోంది, అసలు ప్రసాదం ఎలా తయారు చేస్తారనే సందేహాలు చాలామందికి ఉన్నాయి. కోట్లాది మంది భక్తుల మనసుదోచే అన్నవరం ప్రసాదం తయారీలో దేవస్థానం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. స్థానికంగా దొరికే దినుసులతో ప్రసాదం చేయదు. అత్యంత నాణ్యమైన వస్తువులను రప్పించి మరీ తయారుచేస్తోంది. ప్రసాదం తయారీలో అత్యంత కీలకమైన గోధుమలను ఏకంగా మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ రకం దిగుమతి చేసుకుంటోంది. రత్నగిరి కొండపై గోధుమ నూకగా మర ఆడించడానికి ప్రత్యేక యంత్రాలు వినియోగిస్తారు.





విస్తరాకులే ఎందుకంటే..

సత్యదేవుడి ప్రసాదం ఇప్పటికీ విస్తరాకుల్లోనే భక్తులకు అందిస్తుంటారు. ప్రస్తుతం సాంకేతికంగా అన్నిరంగాల్లో మార్పులు వచ్చినా సత్యదేవుడి ప్రసాదం మాత్రం ఇతరత్రా ప్యాకింగ్‌ల్లో కాకుండా కేవలం విస్తరాకుల్లో వేసి విక్రయించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ప్యాకింగ్ సమయంలో అత్యంత వేడి కలిగిన ఈ ప్రసాదం విస్తరాకుల్లో వేయగానే ఆవిరి, సుగంధ ద్రవ్యాలతో ఆకు మధురంగా మారుతుంది. అందుకే చాలామంది భక్తులు అన్నవరం స్వామి ప్రసాదాన్ని ఆకుతో నాకేయాలంటూ చలోక్తులు విసురుతుంటారు. ఈ విస్తరాకులను ఏజెన్సీ ప్రాంతం నుంచి తీసుకొస్తారు. విస్తరాకుల డిమాండు మేరకు అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలోనే కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది గ్రామంలో 40 ఎకరాల్లో విస్తరాకు తోటలు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.



ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ అందుకుంటున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ (ఫైల్)

అన్నవరం ప్రసాదం తయారీ ఇలా..

ప్రసాదం తయారీకి 3:2:1 నిష్పత్తిలో దినుసులు వేస్తుంటారు. 45 లీటర్ల నీటిని ఎక్కువగా మరిగించి ముందుగా 15 కిలోల మర ఆడించిన గోధుమలను అందులో వేస్తారు. అరగంట ఉడికిన తర్వాత 30 కిలోల పంచదారను కళాయిలో పోసి ఉడికిస్తారు. ఆ తర్వాత స్వచ్ఛమైన ఆవునెయ్యిని మిశ్రమం చేసి ఉడికిన తర్వాత యాలకుల పొడి మిశ్రమాన్ని కళాయిలో వేస్తారు. గంటసేపు వంటస్వాములు బాకుతో తిప్పగా ప్రసాదం పూర్తిగా గోధుమ రంగులోకి వస్తుంది. అప్పుడు ట్రాలీ తొట్టెల్లో కళాయిల నుంచి డంపు చేస్తారు. ట్రాలీ తొట్టెలో వేసిన తర్వాత మరోసారి యాలికల పొడి మిశ్రమాన్ని వేసి మూడు గంటలపాటు ఉంచుతారు. ఆ తరువాత ప్యాకింగ్ విభాగానికి తీసుకెళతారు.



అడ్డాకుల్లో ప్రసాదం



యాలికుల పొడి చల్లి పక్కన ఉంచిన ప్రసాదం

ఏటా రూ.2కోట్లకుపైనే అమ్మకాలు..

సత్యదేవుడి ప్రసాదాన్ని లొట్టలేసుకుని తినని భక్తులుండరు. 150 గ్రాముల ప్యాకెట్లను రూ.20కి విక్రయిస్తారు. రోజంతా విక్రయాలు అందుబాటులో ఉంటాయి. ప్రసాదం ప్యాకెట్లు ఏటా రూ.2కోట్లకుపైగా విక్రయమవుతాయి. ఒక్కొక్క ప్రసాదం ప్యాకెట్టు 150 గ్రాముల ఉండేలా తూనిక లేకుండా హస్తంగరిటతో విస్తరాకుల్లో వేసి 58 మంది ప్యాకింగ్ చేస్తారు. వీటిని బుట్టల్లో 100 ప్యాకెట్ల చొప్పున వేసి మరో 10 మంది కావిడ మోతదారులు ప్రసాదం విక్రయ కేంద్రాలకు తీసుకెళ్తారు. ప్రసాదం భక్తులకు 24 గంటలు అందుబాటులో ఉంచుతారు. ప్రసాదం ప్యాకింగ్ చేసే సమయంలో ప్యాకర్లు తలపై టోపీ చేతులకు గ్లవ్స్ తొడిగి ఎంతో శుచిగా తయారుచేస్తుంటారు. అన్నవరం ప్రసాదం తయారీకి 10 మంది వంటస్వాములు విడతలవారీగా విధులు నిర్వహిస్తారు. వీరంతా కొండపై తయారుచేసిన ప్రసాదాన్ని తిరిగి ఇంటికి వెళ్లి చేసినా రుచి, నాణ్యత రాదంటారు. కేవలం కొండపైనే ప్రసాదం తయారీ విభాగంలో చేస్తేనే సత్యదేవుడి మహిమతో ఇంతటి రుచి వస్తుందని పేర్కొనడం విశేషం.

కుండపోతగా..

ఆరెంజ్ అలర్ట్ జారీ



గొల్లప్రోలులో కురుస్తున్న భారీ వర్షం
(కాకినాడ, ఆంధ్రజ్యోతి)



ఏలేశ్వరంలో నీటమునిగిన రోడ్డు



వర్షపునీటితో ముంపునకు గురైన కరప హైస్కూల్ క్రీడాప్రాంగణం

- జిల్లాకు రెండురోజులపాటు భారీ వర్షాల హెచ్చరిక
- వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా రోజంతా కుండపోత వాన
- శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు వరకు ఏకధాటిగా వర్షం
- అత్యధికంగా శంఖవరం మండలంలో 8.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- వాయుగుండం తీరం దాటనుండడంతో ఆది, సోమవారం భారీ వర్ష హెచ్చరిక
- జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్: కాకినాడ పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూంలు ఏర్పాటు
- కాకినాడ పోర్టు నుంచి మూడోరోజు నిలిచిపోయిన బియ్యం ఎగుమతులు

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో జిల్లా వ్యాప్తంగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. రెండురోజులుగా అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తుండగా, శుక్రవారం వాయుగుండంగా బలపడడంతో దాని ప్రభావంతో శనివారం తెల్లవారుజాము వరకు కుండపోతగా వర్షం పడింది. దీంతో ఎక్కడికక్కడ జన జీవనం పూర్తిగా స్తంభించింది. ప్రధానంగా శుక్రవారం ఉదయం నుంచి వర్షం తీవ్రత బాగా పెరిగింది. దీంతో జిల్లాలో అన్ని స్కూళ్లకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోన్న వాయుగుండం కళింగపట్టణం-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉండడంతో ఆది, సోమవారాల్లో జిల్లాకు భారీ వర్ష సూచన జారీ అయింది. ఈ మేరకు వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసి పదిహేను సెంటీమీటర్ల వరకు కురవొచ్చని హెచ్చరించింది. కాకినాడ పోర్టులో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేశారు. భారీవర్షాలు మరో రెండురోజులు ఉండడంతో కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు మూడోరోజూ నిలిచిపోయాయి.

కంట్రోల్ రూంలు ఏర్పాటు..

జిల్లాలో మరో రెండురోజులపాటు భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అవడంతో కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. ఏవైనా సమస్యలు తలెత్తితే టోల్‌ఫ్రీ నెంబర్ 18004253077 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కాకినాడ నగర పాలక సంస్థలో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255998 కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో 97015 79666 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ తెలిపారు. అత్యవసర సహాయక చర్యలకు అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలకు ఏ సహాయం కావాలన్నా కాకినాడ డివిజన్ కంట్రోల్‌రూం నెంబర్ 9493178718, పెద్దాపురం డివిజన్ 9493178728, జగ్గంపేట డివిజన్ 9490610097 నెంబర్లను సంప్రదించాలని ట్రాన్స్‌కో సూచించింది. కూలిపోయే భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు.

పాఠశాలలకు సెలవు

జిల్లాలో మూడురోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం ఉదయానికి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కాస్తా వాయుగుండంగా బలపడడంతో రోజంతా జిల్లావ్యాప్తంగా కుండపోతగా వాన కురిసింది. దీంతో ఎక్కడికక్కడ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, తుని, ప్రత్తిపాడులో అనేక ప్రధాన రహదారులు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. శనివారం రోజంతా జనజీవనం స్తంభించింది. వర్షం ఏకధాటిగా కురవడంతో అనేక వ్యాపారాలు మూతపడ్డాయి. పలుచోట్ల హోల్‌సేల్ కూర గాయల మార్కెట్లకు సెలవు ప్రకటించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వర్షం తీవ్రత పెరిగి శనివారం ఉదయం నుంచి మరింత ఎక్కువైంది. అప్పటికే తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో పలుచోట్ల జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో అన్ని స్కూళ్లకు శనివారం సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు సైతం గణనీయంగా పడిపోయి చలివాతావరణం కొనసాగింది.



గొల్లప్రోలు జగనన్న కాలనీకి వరద నీటిలో వెళ్లేందుకు పాట్లు పడుతున్న విద్యార్థినులు

సోమవారం సాయంత్రం వరకు జిల్లాకు భారీ వర్ష సూచన పోర్టుకు అందింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో కాకినాడ పోర్టునుంచి మూడోరోజు కూడా విదేశాలకు బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఎక్కడిబార్జీలు అక్కడే పోర్టులో ఉండిపోయాయి. సోమవారం వరకు బియ్యం ఎగుమతులు తాత్కాలికంగా నిలిపివేశారు. మూడురోజులుగా కురుస్తోన్న వర్షాలకు జిల్లాలో అనేకచోట్ల చెరువులకు గండ్లు పడుతున్నాయి. చేలల్లోకి వరద నీరు క్రమేపీ భారీగా వచ్చి చేరుతుండడంతో పంటలు మునుగుతున్నాయి. గొల్లప్రోలు మండలం వన్నెపూడి, గొల్లప్రోలు పట్టణాల వద్ద పంటకాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతో 200 ఎకరాల వరి, ఇతర వాణిజ్య పంటలు నీటమునిగిపోయాయి. తొండంగి రూరల్ మండలం కొమ్మనాపల్లిలో 250 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పిఠాపురం మండలం జమునపల్లిలో వందెకరాలకుపైగా వరి పంట ముంపునకు గురైంది. అనేక మండలాల్లో వందలాది ఎకరాలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు ఆదర్శ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద 216వ జాతీయ రహదారిపై వర్షపునీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గొల్లప్రోలు జగనన్న కాలనీకి వరదనీటిలో వెళ్లేందుకు విద్యార్థినులు పాట్లు పడ్డారు.

అత్యధికంగా అక్కడే..

భారీవర్షాలతో జిల్లావ్యాప్తంగా అనేక మండలాల్లో వర్షపాతం ఎక్కువగా నమోదవుతోంది. జిల్లాలో శుక్రవారం అత్యధికంగా శంఖవరం మండలంలో 8.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తొండంగి మండలం 8.2, పిఠాపురం 7.5, ఏలేశ్వరం 6.7, తుని 6.5, రౌతులపూడి 6.4, గండేపల్లి 6.3, యు.కొత్తపల్లి 5.9, కాకినాడ 5.5, కాకినాడ రూరల్ 5.4, కిర్లంపూడి 5.3, కోటనందూరు 5.2, కరప 4.9, జగ్గంపేట 4.9, గొల్లప్రోలు 4.8, కాజులూరు 4.7, పెదపూడి 4.6, ప్రత్తిపాడు 4.4, తాళ్లరేవు 4.3, పెద్దాపురం 4.2, సామర్లకోట 3.3 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా మొత్తం 118సెం.మీ. వర్షం కురవగా, సరాసరి 5.6సెం.మీ. వర్షపాతం నమోదైంది.

పోటెత్తిన సుద్దగడ్డ వరద



గొల్లప్రోలు జగనన్న కాలనీ వద్ద ప్రవహిస్తున్న సుద్దగడ్డ వరదనీరు

గొల్లప్రోలు, ఆగస్టు 31: సుద్దగడ్డ వరద పోటెత్తింది. భారీవర్షం కురవడంతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ కాలువ వరద నీటితో గట్లకు సమాంతరంగా ప్రవహిస్తోంది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీవద్ద ఐదున్నర అడుగుల ఎత్తులో వరద నీరు ప్రమాదకరంగా ఉంది. కాలనీవాసులు వరద నీటిలో రాకపోకలు నిలిపివేశారు. పట్టణ శివారులోని సూరంపేట కాలనీచుట్టూ వరద నీరు చేరింది. గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారి, తాటిపర్తి-చెందుర్తి రోడ్లపై వరద ప్రవహిస్తోంది.

పుష్కర కాలువకు గండి



వన్నెపూడిలో పుష్కర కాలువకు గండి పడడంతో మునిగిన పొలాలు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 31: వన్నెపూడివద్ద పుష్కర కాలువకు శనివారం గండి పడింది. దీనితో గ్రామంలోని 75ఎకరాల్లో వరి, పత్తి కాయగూరల పంటలతోపాటు పూల తోటలు నీట మునిగాయి. ఇటీవలే వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, ఎరువులు, మందులు వాడి కాపాడుకున్నామని, మళ్లీ వరద నీరు ముంచెత్తడంతో పంటకు తీవ్ర నష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

377 అడుగులకు తాండవ నీటిమట్టం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

తుని రూరల్, ఆగస్టు 31: తాండవ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆయకట్టు ఉపకార్యనిర్వాహణ ఇంజనీరు పి.అనురాధ ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుత నీటిమట్టం 377.80 అడుగులకు చేరి ఉందని, ఇది 378.50 అడుగులకుగానీ చేరితే ఆయుకట్టు స్పిల్‌వే గేట్లు ఎత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు నది లోకిగానీ, అంచుల్లోకి గానీ వెళ్లవద్దని హెచ్చరించారు.

చర్చల జీవోలను విడుదల చేయాలి

- 3న ధర్నా.. డీఎంహెచ్‌వోకు ఆశావర్కర్ల సమ్మె నోటీసు



డీఎంహెచ్‌వో నరసింహనాయక్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ఆశావర్కర్ల ప్రతినిధులు

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 31: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అధికారులతో వివిధ అంశాలపై జరిపిన చర్చల జీవోలను విడుదల చేయాలని కోరుతూ సెప్టెంబర్ 3న ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమండల పద్మ తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్‌కు శనివారం ధర్నా నోటీసును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 8న ఛలో విజయవాడ నిర్వహించి డీవార్మింగ్‌డేను బాయ్ కాట్ చేయడంతో అధికారులు ఆశావర్కర్లతో చర్చలు జరపారన్నారు. ఇందులో కొన్ని అంశాలపై మినిట్స్ కాపీలు ఇచ్చారని, నేటికీ జీవోలు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ 62ఏళ్లకు రిటైర్మెంట్ పరిమితి పెంచితే ఆశాలను మాత్రం 60ఏళ్లకు పరిమితం చేసి ఏ విధమైన బెనిఫిట్స్ లేకుండా చేయడం తగదన్నారు. ప్రసూతి సెలవులు, మెడికల్ లీవులు, ప్రభుత్వ సెలవుల తదితర వాటికి జీవోలు ఇవ్వాలని, ఇంకా పలు డిమాండ్లతో 3వతేదీ భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అంకాడి పద్మావతి, ఎస్.లక్ష్మి, సోనీ తదితరులు పాల్గొన్నారు.

వీధిన పడ్డ అధికారుల పోరు

- మునిసిపల్ సమావేశంలో కమిషనర్, డీఈఈ బాహాబాహీ
- ఇద్దరి మధ్య తోపులాట, తిట్ల దండకం
- పిఠాపురం మునిసిపల్ డీఈఈ సస్పెన్షన్

- 5లో

ఆయ్.. నేను గోదారోన్నేనండి!

- సినిమా రంగంలో రాణిస్తున్న కసిరెడ్డి రాజకుమార్
- ఇటీవల ఆయ్ సినిమాతో ప్రేక్షకులతో గిలిగింతలు

- 5లో

డొంకరాయి జలాశయం నుంచి..

రెండు గేట్లు ద్వారా 4400 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి రెండు గేట్లు ద్వారా 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గత రెండ్రోజులుగా డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో వలసగెడ్డ, మంగంపాడు, వాగుల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయి చేరుకోకుండా చర్యలు చేపట్టారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా, 1036 అడుగుల వద్ద నీటిమట్టం క్రమంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. జలాశయంలోకి 8 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లోస్ వస్తుండడంతో 4 వేల క్యూసెక్కులు కెనాల్ ద్వారా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తుండగా, 4400 క్యూసెక్కుల నీటిని జలాశయం రెండు గేట్ల ద్వారా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. **- మోతుగూడెం**



వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.21.94 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. జోరువానలో భక్తులు తడుచుకుంటూ స్వామివారి వ్రతం ఆచరించారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సతీమణి వెంకటేశ్వరిదేవి సామాన్య భక్తురాలిగా స్వామిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.21.94 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్ కుమార్ తెలియజేశారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి.. ఆలయంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ సతీమణి వెంకటేశ్వరిదేవి పూజలు



ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా అల్లు దుర్గా భవాని

ద్రాక్షారామ, ఆగస్టు 31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వాహణాధికారిగా అల్లు వెంకట దుర్గాభవాని నియమితులయ్యారు. ఆమె శనివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బంది పలువురు ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆయ్ సినిమా షూటింగ్‌లో రాజ్‌కుమార్



ఆయ్.. నేను గోదారోన్నేనండి!

» సినిమా రంగంలో రాణిస్తున్న కసిరెడ్డి రాజకుమార్

» ఇటీవల ఆయ్ సినిమాతో ప్రేక్షకులతో గిలిగింతలు


గోదావరి జిల్లాల నుంచి ఎందరో సినిమా రంగంలో అడుగుపెట్టి ఎంతోపేరు ప్రఖ్యాతలు సాధించారు. అలా ఇప్పుడు హాస్యనటుడిగా చిత్రపరిశ్రమలో మంచిపేరు సాధించారు కసిరెడ్డి రాజకుమార్. ఇటీవల వచ్చిన ఆయ్ సినిమాలో గోదావరి యాసలో డైలాగ్స్ అదరగొట్టి ప్రేక్షకులతో నవ్వులు పూయించారు ఈ యువనటుడు. తన తల్లి, తాత వెన్ను తట్టి ప్రోత్సహించి తనలో ఉన్న ఆసక్తిని గమనించి పూర్తి సహకారాన్ని అందించడంతో సినీ రంగంలో మంచి స్థాయికి చేరుకున్నానని చెబుతున్నాడు రాజకుమార్. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన కసిరెడ్డి సీతారామయ్య, గంగా భవాని ఏకైక కుమారుడు రాజ్‌కుమార్. తండ్రి మరణించడంతో రాజ్‌కుమార్ తన తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరు అయిన భద్రవరం చేరుకున్నాడు. తాత మాణిక్యం వ్యవసాయ పనులు చేసుకుంటూ భజన పాటలు ఆలపించేవారు. అక్కడే భజన బృందాలు వాయించే హార్మోనియం, వాయిద్యం రాజ్‌కుమార్‌ని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో మ్యూజిక్‌లో డిప్లమా పట్టా పొందాడు. రాజ్‌కుమార్‌లో ఉన్న ఆసక్తిని ముందుగానే గమనించిన తల్లి గంగాభవాని హైదరాబాద్ పంపించి ప్రోత్సహించారు. అలా హైదరాబాద్ వెళ్లిన రాజకుమార్ తన టాలెంట్‌తో సినిమాల్లో రాణించాడు. రాజావారు రాణిగారు, అశోకవనంలో అర్జున కల్యాణం, బెదురులంక 2012, అర్జున ఫాల్గుణతోపాటు పలు సినిమాల్లో కమెడియన్‌గా అలరించాడు రాజ్‌కుమార్. ఇటీవల ఆయ్ సినిమాతో సక్సెస్ సాధించిన ఈ హాస్యనటుడిని ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విశేషాలను పంచుకున్నాడు.



ఆయ్ సినిమా విజయం సాధించిన సందర్భంగా రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న జూనియర్ ఎన్టీఆర్

ప్రశ్న: సినిమా రంగంలో అవకాశం ఎలా వచ్చింది?
రాజ్‌కుమార్: నాకు చిన్ననాటి నుంచి సినిమాలు అంటే ఇష్టం. రాజావారు రాణిగారు సినిమా దర్శకుడు కోలా రవికిరణ్ సహకారంతో నాకు తొలి చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అలా మొదటగా రాజావారు రాణిగారు సినిమాలో నటించాను. ఆ సినిమాలో చౌదరి క్యారెక్టర్ నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని సినిమాల్లో నటించారు?
రాజ్‌కుమార్: ఇప్పటివరకు పది సినిమాల్లో నటించారు. అన్ని పాత్రల్లో నాకు నటన సంతోషాన్నిచ్చింది.



'బ్లడీ మేరీ' చిత్రంలో రాజ్‌కుమార్

ప్రశ్న: మీ జీవితంలో ఎవరి ప్రోత్సాహం అధికంగా ఉంది.?
రాజ్‌కుమార్: మా తాత మాణిక్యం నన్ను పూర్తిగా ప్రోత్సహించారు. అండగా ఉంటూ నేను సంగీతంలో పట్టా తీసుకోవడంలో సహకరించారు. తాత మరణం అనంతరం మా అమ్మ నువ్వు సినీ రంగంలో మంచిస్థానంలో ఉన్నప్పుడే తాత ఆత్మశాంతిస్తుందని చెబుతూ ఉండేది. ఆమె మాటలే నా జీవితాన్ని మలుపుతిప్పాయి.

ప్రశ్న: మీకు సంతృప్తినిచ్చిన పాత్రలేమిటి?
రాజ్‌కుమార్: నా తొలిచిత్రం రాజావారు రాణిగారు సినిమాలో చౌదరి పాత్ర మంచిపేరు తెచ్చి పెట్టింది. ఇటీవల విడుదలైన ఆయ్ చిత్రంలో హీరో స్నేహితుడిగా సుబ్బు పాత్ర కూడా నాలో ఉన్న ప్రతిభకు మెరుగులుదిద్దింది.

ప్రశ్న: మీ లక్ష్యం ఏమిటి?
రాజ్‌కుమార్ : తక్కువ చిత్రాల్లో నటించినా నాకంటూ సినీరంగంలో ఒక ప్రత్యేక స్థానం ఉండాలి.

ప్రశ్న: కొత్త సినిమాలు ఏం చేస్తున్నారు?
రాజ్‌కుమార్: హీరో విజయ దేవరకొండ సినిమా ఒకటి, ఇంకా రెండు కొత్త సినిమాల్లో నటిస్తున్నాను.

ప్రశ్న: ఆయ్ సినిమా ఇంత విజయం సాధించడం మీకెలా ఉంది?
రాజ్‌కుమార్ : చాలా సంతోషంగా ఉంది.

- ఏలేశ్వరం

అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీం పనులకు రూ 25.32 కోట్లు

త్వరలో ఆర్థికపరమైన అనుమతులు

అన్నవరం, ఆగస్టు 31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి గత ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్న ప్రసాద్ స్కీం నిధుల విషయంలో మరో అడుగు ముందుకుపడింది. ప్రస్తుతం అన్నదాన భవన అవసరం దృష్ట్యా ఈవో రామచంద్రమోహన్ పర్యాటక అధికారులను ప్రసాద్ స్కీం నిధుల విషయం ఎంతవరకు వచ్చిందని శనివారం ఆరాతీశారు. స్కీం నిధులకు అనుమతులు వచ్చాయని, త్వరలో ఆర్థికపరమైన ఉత్తర్వులు వెలువడతాయని, అనంతరం టెండర్లు పిలిచి పనులు మొదలపెట్టవచ్చునని సమాధానమివ్వడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రసాద్ స్కీం పనులను ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించినా ఆర్థికపరమైన అనుమతులు ఆలస్యమవుతూనే ఉన్నాయి. తాజాగా 25.32 కోట్లకు అనుమతులురాగా త్వరలో ఆర్థికపరమైన ఉత్తర్వులు వస్తాయని టూరిజం అధికారులు పేర్కొన్నారని సమాచారం. వీటితో అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటుకు అనుమతులు లభించాయి. కాగా మోదీ వర్చువల్ ప్రారంభోత్సవంలో రూ.20.62 కోట్ల పనులని ప్రకటించగా రూ.25.32 కోట్లు అని తెలపడంతో ఆలయ అధికారులు కొంత సందిగ్ధంలో పడ్డారు.

మునిసిపల్ ఆర్డీగా నాగనరసింహరావుకు పూర్తి బాధ్యతలు

కార్పొరేషన్(కాకినాడ)/రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నాగనరసింహరావు కాకినాడ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ మునిసిపల్ ఆర్‌డీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆయనను రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం బదిలీచేసింది. అంతకుముందు కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఐదేళ్లు పనిచేశారు. ఈ ఐదేళ్లలో ఆయన ఎఫ్ఏసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా, ఎఫ్ఏసీ కౌడా వైస్ చైర్మన్‌గా, మెప్మా ఇన్‌చార్జి పీడీగా, కొవిడ్ సమయంలో స్పెషల్ ఆఫీసర్‌గా, ఎన్నికల అధికారిగా పలు బాధ్యతలు నిర్వహించారు. నరసింహరావు ఆర్డీగా వెళుతుండడంతో కాకినాడ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న కేటీ సుధాకర్ కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ బాధ్యతలు చేపట్టనున్నారు. కౌడా వైస్ చైర్మన్‌గా కార్పొరేషన్ కమిషనర్ భావనకు ఎఫ్ఏసీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు వీసీగా పనిచేస్తున్న కృష్ణమూర్తి తన మాతృశాఖ రెవెన్యూకు వెళ్లనున్నారు.

రుడా వీసీ బాలస్వామి రిలీవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) వీసీగా పనిచేస్తున్న బాలస్వామిని రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆయన్ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. బాలస్వామి గత ప్రభుత్వ హయాం నుంచి రుడా వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఆయనను రిలీవ్ చేశారు. ఇన్‌చార్జి వీసీగా అదనపు బాధ్యతలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రైవేటుకే ఓకే!

మద్యం షాపులకు 15న నోటిఫికేషన్

వచ్చే నెల 1 నుంచి కొత్త విధానం... ఇక 'జె' బ్రాండ్లకు స్వస్తి

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో ప్రైవేటు షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభించనున్నారు. జగన్ పిచ్చి బ్రాండ్లకు, నాసిరకం మద్యానికి పూర్తిగా స్వస్తి చెప్పి కొత్త మద్యం విధానం తీసుకొచ్చే ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగంగా చేస్తోంది. ఈ క్రమంలో నాలుగైదు రోజుల్లో ఎంసీ, సియాగ్రమ్స్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన ఎంసీ బాండ్రీ, విస్కీ, ఐబీ విస్కీ, నాకౌట్, ఖజురహో బీర్‌లు తదితర బ్రాండ్ల సరుకు మార్కెట్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే వీటి సరఫరాకు ఆయా కంపెనీలకు ఇండెంట్లు వెళ్లాయి. ఇక కొత్త మద్యం పాలసీపై నోటిఫికేషన్ ఈ నెల 15న విడుదల అవుతుందని చెబుతున్నారు. 25కి ప్రక్రియ పూర్తి చేసి 30 నాటికి ప్రైవేటుషాపుల్లో అమ్మకాలు ప్రారంభించనున్నారు. అక్టోబరు 1 నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, జగన్ పిచ్చి బ్రాండ్లు కనుమరుగు అవుతాయనే చర్చ నడుస్తోంది. ధరలు కూడా దిగిరానున్నాయి. రూ.120కే రెండు మూడు మంచి బ్రాండ్ల మద్యం అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. నాణ్యమైన చీప్‌లిక్కర్‌కి రూ.100లోపే ధర నిర్ణయిస్తారని సమాచారం. అయితే ప్రస్తుతం ఉన్న బార్ల యాజమాన్యాలు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందితో కాస్త ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులు 7న రాష్ట్ర వ్యాప్తంగా షాపులు మూసేసి ధర్నా చేయడానికి పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వంలో మద్యం ధరలు అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. దానికితోడు బార్లలో క్వార్టరుపై సుమారు రూ.80 వరకూ, బీరుపై రూ.100-130 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేటు షాపులు, పర్మిట్ రూంలు వస్తే ఈ విధానం కుదరదు. పైగా ప్రైవేటు షాపుల్లో అన్ని బ్రాండ్లూ అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న బార్లకు మందుబాబులు వెళ్లే పరిస్థితి ఉండదు. వీటికి లైసెన్సులు జారీ చేసి ఇప్పటికే ఏడాది గడిచింది. రెండో ఏడాది మొదలు కావడంతో లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే నిడదవోలులోని రెండు బార్లు ఫీజు చెల్లించలేదు. ఏదిఏమైనా మందుబాబులకు ఇచ్చిన మాట నెరవేర్చేలా బ్రాండ్ మద్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చేపనిలో ఉంది.







కమిషనరుపై దాడిచేస్తున్న డీఈఈ... డీఈఈపై దాడికి దిగిన కమిషనర్.. మునిసిపల్ ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు

వీధిన పడ్డ అధికారుల పోరు

పిఠాపురం మునిసిపల్ సమావేశంలో కమిషనరు, డీఈఈ బాహాబాహీ.. వారి బూతులకు తలదించుకున్న మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది

పిఠాపురం, ఆగస్టు 31: పిఠాపురం పురపాలక సంఘంలో కొంతకాలంగా అధికారుల మధ్య సాగుతున్న అంతర్గతపోరు వీధినపడింది. కౌన్సిల్ సమావేశంలోనే కమిషనరు, డీఈఈలు తోపులాట, బాహాబాహీకి దిగారు. సమావేశంలో మహిళలు ఉన్నారని, తాము ఉన్నతాధికారులమని మరిచిపోయి ఇద్దరూ బూతులు తిట్టుకున్నారు. పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలో శనివారం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి హాజరుకాకపోవడంతో వైస్‌చైర్మన్-1 పచ్చిమళ్ల జ్యోతి సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో అజెండాలోని అంశాలు చదువుతుండగా కౌన్సిలరు బోను దేవ మునిసిపాలిటీలో నూతనంగా నియమితులైన అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లింపు అంశాన్ని ప్రస్తావించారు. కౌన్సిల్‌కు సమాచారం లేకుండా ఆరునెలలు కిందట ఏడుగురుని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని, వీరిని నియామకాన్ని రద్దుచేయాలని కౌన్సిల్ తీర్మానం చేసిందని ఆయన గుర్తుచేశారు. కౌన్సిల్ వ్యతిరేకించినా ఏడుగురికి ఏవిధంగా జీతాలు చెల్లించారని, ఇంజనీరింగ్ విభాగంలో ఏ అధికారీ లేరని చెబుతున్నారని, అటువంటప్పుడు బిల్లు ఏ విధంగా చేశారని దేవతోపాటు పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీనిపై మునిసిపల్ కమిషనరు కనకారావు సమాధానమిస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు జీతాలు చెల్లించామన్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో కొంతకాలంగా ప్రస్తుత మునిసిపల్ డీఈఈ భవానీశంకర్ తనకు సహకరించడం లేదని, దీంతో తాను ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించగా, ఆ బాధ్యతలను పబ్లిక్‌హెల్త్ ఈఈ హస్సేన్‌కు అప్పగించారని వివరించారు. ఈ సమయంలో డీఈఈపై కమిషనరు కొన్ని ఆరోపణలు చేశారు. డీఈఈ వల్ల ఏ పని జరగడం లేదని చెప్పుకొచ్చారు. పనుల నిర్వహణలో పలు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీంతో డీఈఈ భవానీశంకర్ ప్రత్యారోపణలు చేశారు. కమిషనరు వల్లే అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, 15మంది ఉద్యోగులు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారని డీఈఈ తెలిపారు. తనను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తే కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నానని తెలిపారు. ఈ సమయంలో కమిషనరు, డీఈఈలు ఆరోపణలు చేసుకున్నారు. ఇది వాగ్వివాదం, తోపులాటకు దారితీసింది. ఇరువురు ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. బూతులు తిట్టుకున్నారు. దీనితో ఒక్కసారిగా కౌన్సిల్ అంతా విస్మయానికి లోనైంది. కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది వచ్చి కొట్లాటకు దిగిన కమిషనరు, డీఈఈలను విడదీశారు. వీరు బూతులు తిట్టుకోవడంతో మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. మునిసిపల్ కమిషనరుగా కనకారావు ఫిబ్రవరిలో ఇక్కడకు బదిలీపై వచ్చారు. అప్పటినుంచి కమిషనరు, డీఈఈల మధ్య విభేదాలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో డీఈఈగా ఉన్న భవానీశంకర్ సెలవు పెట్టడం, అదే సమయంలో డీఈఈపై కౌన్సిలర్ల ఫిర్యాదు నేపథ్యంలో అతన్ని పబ్లిక్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేస్తూ కమిషనరు కనకారావు ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో డీఈఈ హైకోర్టును ఆశ్రయించి తిరిగి విధుల్లోకి చేరగా, డీఈఈ చాంబర్‌కు కమిషనరు తాళాలు వేయించడం వివాదస్పదంగా మారింది. అప్పటినుంచి ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. డీఈఈ తనకు సహకరించడం లేదని, పనులు చేయడం లేదంటూ ఉన్నతాధికారులకు కమిషనరు ఫిర్యాదు చేయడంతో పబ్లిక్‌హెల్త్ ఈఈని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం మరింత ముదిరింది.

ఉన్నతాధికారుల విచారణ.. డీఈఈ సస్పెన్షన్

మునిసిపల్ సమావేశంలో కమిషనరు, డీఈఈ కొట్టుకున్న వ్యవహారంపై పురపరిపాలనాశాఖ ప్రాంతీయ డైరెక్టరు నాగనరసింహరావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్‌లు విచారణ చేపట్టారు. కమిషనరు, డీఈఈతోపాటు మునిసిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. కమిషనరు, డీఈఈలను వారు మందలించారు. కమిషనరు, డీఈఈల వ్యవహారశైలి గురించి ప్రత్యేకంగా విచారించారు. మునిసిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలు, నిబంధనలకు విరుద్ధంగా పోస్టుల భర్తీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని మునిసపల్ ఆర్డీ, కాకినాడ ఆర్డీవోలు తెలిపారు. కాగా పిఠాపురం మునిసిపల్ డీఈఈ ఎస్.భవానీశంకర్‌ను సస్పెండ్ చేస్తూ పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై మునిసిపల్ ఆర్డీ నాగనరసింహరావు, ఆర్డీవో ఇట్ల కిషోర్‌లు విచారణ జరిపి కలెక్టరుకు నివేదిక ఇచ్చారు. కమిషనరుతో వాగ్వివాదానికి దిగి, మ్యాన్‌హేండ్లింగ్ చేయడంతోపాటు అతనిపై ఉన్న అవినీతి ఆరోపణలు దృష్టిలో ఉంచుకుని డీఈఈని సస్పెండ్ చేయాలని కలెక్టరు సిఫారసు చేశారు.



ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

ఇద్దరు మగ, ఒకరు ఆడపిల్ల జననం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో శారదానర్సింగ్ హోమ్‌లో శనివారం అరుదైన కాన్పు జరిగింది. రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి చెందిన ఆలపాటి సంధ్యాకుమారి ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చింది. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టారు. శారదా నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ గిరిబాల, డాక్టర్ శ్రావ్య బృందం ఆరోగ్యశ్రీ ద్వారా కుమారికి శస్త్ర చికిత్స చేసి కాన్పు జరిపారు. పిల్లలు ముగ్గురు పూర్తి ఆరోగ్యంతో ఉండవలసిన బరువుతో ఉన్నట్టు డాక్టర్ గిరిబాల తెలిపారు. డాక్టర్ గిరిబాల మాట్లాడుతూ ఆలపాటి వీరబాబు, సంధ్యాకుమారిలకు వివాహమై ఐదేళ్లు అయినా సంతానం కలగలేదని, శారద నర్సింగ్ హోమ్‌లో చికిత్స తీసుకున్నాక సంధ్యాకుమారి గర్భందాల్చిందని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడికి రిమాండ్

కరప, ఆగస్టు 31: వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ అతడికి 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ కె.రామారావు తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో 85 ఏళ్ల వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ గురువారం రాత్రి అత్యాచారయత్నానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. బాధితురాలు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిపై ఇంట్లోకి అక్రమ ప్రవేశం, దాడి, అత్యాచారయత్నం సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. విచారణలో భాగంగా వేళంగి గ్రామ శివారున నిందితుడిని అదుపులోకి తీసుకుని శనివారం కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచామన్నారు. నిందితుడికి రిమాండ్ విధించగా కాకినాడ సబ్‌జైలుకు తరలించామని వివరించారు.

బహిర్భూమికి వెళ్లి డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి

పి.గన్నవరం, ఆగస్టు 31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక నుంచి మానేపల్లి శివారు శివాయిలంక వరకు మిగులు నీరు ప్రవహించే మినీ డ్రైన్‌లో శనివారం ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి జారిపడి మృతిచెందాడు. నాగుల్లంక శివారు శివాయిలంకకు చెందిన బొండాడ రామకృష్ణ (46) శనివారం ఉదయాన్నే స్థానికంగా ఉన్న తోటల్లో మినీ డ్రైన్ చెంతకు బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో జారిపడగా కేకలు వేశాడు. స్థానికులు వచ్చి రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే రామకృష్ణ మునిగిపోయాడు. రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని స్థానికంగా ఉన్న ఈతగాళ్ల సాయంతో రామకృష్ణ మృతదేహాన్ని వెతికితీశారు. అనంతరం ఎస్ఐ బి.శివకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణకు భార్య శ్రీలక్ష్మి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి భార్య పిల్లలు, బంధువులు రోదిస్తుండడంతో శివాయిలంక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నుజ్జయిన లారీ క్యాబిన్

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పాచిపెంట, ఆగస్టు 31: పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలోని కంకణాపల్లి సమీపంలో గల ఘాట్ రోడ్డు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ చెట్లపల్లి తాతారావు (58) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. నవరంగపూర్ నుంచి కాకినాడకు దాణా లోడుతో వెళ్తుండగా కంకణాపల్లి వద్ద ముందున్న లారీని ఢీకొట్టింది. దీంతో క్యాబిన్ నుజ్జుకావడంతో డ్రైవర్ తాతారావు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ తాతారావు కుమారుడు విజయకుమార్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సమర్పణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆదిత్య'లో మెగా బూట్ క్యాంప్

గండేపల్లి, ఆగస్టు 31: మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈసీఈ విభాగం నందు మెగా బూట్ క్యాంప్ ఆగస్టు 30, 31న విజ్ఞానదాయకంగా జరిగింది. ఎంబెడెడ్ ఇంజనీర్లు కె.ఆదిత్య, జి.జనార్ధనరెడ్డి, డాక్టర్ ఎస్ఎల్ శ్రవణ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడిందని ఆదిత్య డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ప్రతి పనికి ర్యాటిఫికేషన్ అంటే ఎలా?

పిఠాపురంలో మున్సిపల్ కౌన్సిలర్ల ఆగ్రహం

పిఠాపురం, ఆగస్టు 31: ప్రతి పనికి ర్యాటిఫికేషన్ అంటే ఎలా, కౌన్సిల్ వాయిదా వేసిన అంశాలకు ముందుస్తు అనుమతి తీసుకుని మమ్మల్ని అవమానిస్తున్నారంటూ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాలులో వైస్‌చైర్మన్-1 పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. కౌన్సిలరు తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అత్యవసర పనులకు మాత్రమే చేయాల్సిన ర్యాటిఫికేషన్‌ను ప్రతి సాధారణ పనికి చేయించడం ఏంటని అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిల్ అజెండాలో 70శాతంపైగా ర్యాటిఫికేషన్ అంశాలే ఉన్నాయని తెలిపారు. కౌన్సిల్ గత సమావేశాల్లో వాయిదా వేయాలని సూచించిన అంశాలకు ర్యాటిఫికేషన్ ఎలా తీసుకుంటారని నిలదీశారు. అత్యవసర పనులు, బడ్జెట్ అంశాలు మినహా మిగిలిన ర్యాటిఫికేషన్ అంశాలన్నింటిని తిరస్కరిస్తున్నట్లు తలిశెట్టి ప్రకటించగా, మిగిలిన కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. పురపాలక సంఘంలో పలు అవకతవకలు జరుగుతున్నాయని తలిశెట్టి, టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ ఆరోపించారు. కుళాయిల ద్వారా కలుషితమైన తాగునీరు సరఫరా చేస్తున్నారని, దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని కౌన్సిలర్లు బొజ్జా జగదీశ్వరీ, నీలవేణి, బండి ఉమామహేశ్వరి, పోచయ్య, రాయుడు శ్రీనులు తెలిపారు.

3 నెలలుగా పరిష్కారం కాని పారిశుధ్య సమస్య

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట, ఆగస్టు 31: నా వార్డులో 3 నెలలుగా పారిశుధ్య సమస్య పరిష్కరించడం లేదు. అధికారులు, ఛైర్‌పర్సన్‌కు పలు దఫాలు తెలిపిన పరిష్కారం లేదు. దీంతో 3నెలలుగా సొంత డబ్బులు వెచ్చించి పారిశుధ్య పనులు చేయించుకుంటున్నాను. మున్సిపాల్టీ నిద్దరోతుంది. ఇలా ఎంతకాలం చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తుంది అని వైసీపీ కౌన్సిలర్ కాళ్ళ శ్యామల వాపోయారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రెండున్నరేళ్లుగా ఏ సమస్యయైనా అధికారులు, ఛైర్‌పర్సన్‌ల దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారం శూన్యం, ఎందుకీ సమా వేశాలు అంటూ కౌన్సిలర్లు చల్లపల్లి శ్రీను, నేతల హరిబాబు, పితాని కృష్ణ వాపోయారు. తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారుచేశారని, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో సభ్యులందరికీ జాబితా ఇవ్వాలని ఆవాల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మున్సిపల్ డీఈ అధికారిణి ఏ విధులు నిర్వర్తిస్తున్నారో తెలియడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అజెండాలో అంశాలు ప్రవేశపెట్టి చర్చ లేకుండానే 20నిమిషాల్లో ముగించారు.

'ప్రజా సమస్యలను గాలికొదిలేశారు'

పెద్దాపురం, ఆగస్టు 31: ప్రజాసమస్యలను పూర్తిగా గాలికివదిలేశారని, ప్రజల బాధలు పట్టవా అంటూ పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ముందుగా వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ వారపుసంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కరరావు మాట్లాడుతూ మార్కెట్‌కు ఆనుకుని ఉన్న స్థలాన్ని డంపింగ్ యార్డుగా అభివృద్ధి చేయాలన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ శతాబ్ది పార్కును అభివృద్ధి చేశామని చెప్పుకోవడమే తప్ప పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాట్లు చేయకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో సమస్యలపై ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్లు అరెళ్ల వీర్రాఘవరావు, వాసంశెట్టి గంగ, విడదాసరి రాజా తదితరులున్నారు.

'ఆమోదించడమే.. అభివృద్ధి లేదు'

ఏలేశ్వరం, ఆగస్టు 31: కౌన్సిల్ సమావేశంలో అజెండా ఆమోదించడమే సరిపోతుందని అభివృద్ధి ఏమీలేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏలేశ్వరం ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలను జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వినిపించారు. కొన్నింటిని కౌన్సిలర్లు ఆమోదించగా కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలపై సమావేశంలో ప్రస్తావించడం తప్ప సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయడంలేదని వాపోయారు. పట్టణంలో పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వా నంగా ఉందని, పూడిక తీత పనుల నిమిత్తం ఆర్థిక సంఘం నిధులు ఉన్నా పనులు మాత్రం చేపట్టడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అలమండ చలమయ్య, సామంతుల హైమావతి, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అధికారులు సమన్వయంతో పని చేయాలి'

తుని రూరల్, ఆగస్టు 31: వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ప్రతి ఎకరా సంవృద్ధిగా పంటలు పండించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తునిలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన ఫెర్టిలైజర్స్ డీలర్‌లకు సర్టిఫికెట్లు పంపిణీ పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖాధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమంపై వివరించారు. కార్యక్రమంలో ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, సిద్ధాంతపు సత్తిబాబు, మళ్ళ గణేష్‌కుమార్, అల్లు రాజు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మపీడి వై. జ్యోతిర్మయి, కోఆర్డినేటర్ బీఎస్ రావు, ఏడీఏ బుల్లిబాబు, ఏవో వెంకటలక్ష్మి, కేజే చంద్రశేఖర్ ఉన్నారు.

'బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

జగ్గంపేట, ఆగస్టు 31: గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఘటనను ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో రంగవల్లి నగర్‌లో ధర్నా నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాన్ శ్రీను, సోమరాజు, శ్రీను, దుర్గమ్మ పాల్గొన్నారు. గుడ్లవల్లేరులోని ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఘటనకు కారుకులైన దుర్మార్గులను శిక్షించాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట డిగ్రీ కాలేజ్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, విద్యార్థి సంఘ నాయకులు, మోసే, సాయి ఉన్నారు.

'అంకితభావంతో పనిచేసిన ఏవో వరప్రసాద్'

కాకినాడ సిటీ, ఆగస్టు 31: అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందిన జడ్పీ ఏవో వరప్రసాద్ జీవితానికి సార్థకత చేకూరిందని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన జడ్పీ పరిపాలనాధికారి కొప్పిశెట్టి స్వామి వరప్రసాద్ ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించారు. కొవ్వూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి, జిల్లా పంచాయతీ అధికారిణి సౌజన్య, జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీ సత్యనారాయణ,జడ్పీ డిప్యూటీ సీఈవో ఓ.రామ్‌గోపాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ప్రమాదాలకు దారి తీసే ఫ్లెక్సీలు తొలగింపు'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 31: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో రోడ్డు డివైడర్ల మధ్యలో ముఖ్యమైన కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను వెంటనే తొలగిస్తామని, ఇకపై అనుమతులు ఉండవని డీసీపీ హరిదాస్ శనివారం తెలిపారు. రోడ్డు సెంట్రల్ మీడియమ్‌లు, యుఎల్‌బీలలోని ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు వంటి ఎడ్వర్‌టైజ్‌మెంట్ల కారణంగా రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజలు, వాహనదారుల దృష్టిని మరల్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయని డీసీపీ తెలిపారు.

కోరింగలో ఫారెస్ట్ అధికారుల బృందం సందర్శన

తాళ్లరేవు, ఆగస్టు 31: రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ 9వ బ్యాచ్ 28మంది రాజమండ్రి ఫారెస్ట్ సెక్షన్ అధికారులు బృందం వన్యప్రాణి రేంజ్ కోరింగ అభయారణ్యంలో కోరింగ ఫారెస్టులో సీబీఈటీను శనివారం సందర్శించారు. వారికి సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారిణి టి.అనూష, కోరింగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.వరప్రసాద్ మడఅడవుల ప్రాముఖ్యత, ఎకో-టూరిజం, హోప్ఐల్యాండ్ విశిష్టత, మడఅడవుల్లో ఉన్న వివిధ రకాల జాతి మొక్కలు, జంతువులు, తాబేళ్ల సంరక్షణ పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఏవి.రమణమూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లున్నారు.

ఎమ్మెల్యే పంతం నానాజీకి అభినందనలు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 31: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు సచివాలయాల వారీగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే పంతం నానాజీకి అభినందనలు తెలుపుతున్నట్టు రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు పేర్కొన్నారు. పవన్ ఆశయ సాధనకు సామాజిక ఆలోచనతో స్పందించడం హర్షణీయమన్నారు

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 31: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.29,910 అన్నదాన విరాళాలు రూ.53,578 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 5,840, తులాభారం ద్వారా రూ. 250, లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా 7,875 వెరసి రూ.97,453 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 3వేలమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులున్నారు.

ఎడతెరిపి లేని వర్షం

- రహదారులు, డ్రెయిన్లు ఏకం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రహదారులపై వర్షపు నీరు
- ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- ముంపులో పంటపొలాలు



గొల్లప్రోలు రూరల్: వన్నెపూడిలో రోడ్డుపై వర్షపునీరు, కరప రహదారిపై వర్షంనీరు, గొల్లప్రోలులో మునుగుతున్న పొలాలు, తునిలో నేలకొరిగిన రామాలయం

పిఠాపురం, ఆగస్టు 31: ఎడతెరిపి లేని వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు, డ్రెయిన్లు ఏకమయ్యాయి. వర్ష ప్రభావంతో ప్ర భుత్వ, ప్రవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి దాని ప్రభావంతో పిఠాపురం, పరిసర ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10.30గంటల వరకూ మధ్యలో విస్తారంగా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. ఎక్కడిక్కడ డ్రెయిన్లు పొంగిపొర్లాయి. రహదారులపై ఉన్న వర్షపునీటిలోనే ప్రజలు రాకపోకలు సాగించారు. మార్కెట్‌కు వెళ్లే మార్గాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు, వారి సహాయకులు వర్షంలో తడుస్తూనే ప్రయాణాలు సాగించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను వెనక్కి పంపారు. రాత్రి వర కు వర్షం, ఆపై జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో రహదారులపై జనసంచారం అంతంతమాత్రంగానే ఉంది.

పిఠాపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో శనివారం కురిసిన భారీ వర్షాలతో పంటపొలాలు నీట మునిగాయి. జములపల్లి తదితర గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లోని వరి పంట ముంపునకు గురయింది. గ్రామాల్లోని రహదారులు జలమయమయ్యాయి.

గొల్లప్రోలు: గొల్లప్రోలులో శుక్రవారం తెల్లవారుజాము నుంచి విరామం ఇవ్వకుండా కురుస్తున్న వర్షం శనివారం ఉదయం తీవ్రమైంది. కుంభవృష్టి మాదిరిగా 2 గంటలు పాటు కురిసిన వర్షంతో ప్రధాన ఆర్అండ్‌బీ రహదారితో పాటు ప్రధాన వీధులన్ని జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్డుపై నీరు ప్రవహించింది. కొన్ని ప్రాంతాల్లో రెండు అడుగుల ఎత్తున వర్షపునీరు ప్రవహించింది. కాలనీల్లో పలుచోట్ల నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం రాత్రి వరకూ పడుతూనే ఉంది.

గొల్లప్రోలు పట్టణంలోని సుద్దగడ్డకు చేర్చి ఉన్న పంటకాలువకు శనివారం సాయంత్రం గండి పడింది. దీంతో సమీపంలోని పంటపొలాల్లోకి వరద నీరు చేరుతున్నది. ఈ కాలువకు పడిన గండి కారణంగా జగనన్న కాలనీ వాసులు ప్రత్యామ్నాయ రహదారిగా వినియోగిస్తున్న మార్గం కూడా మూసుకుపోయింది.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం వన్నెపూడిలోని ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపైకి భారీగా వర్షపునీరు చేరింది. వన్నెపూడి నుంచి ఎన్‌హెచ్-216కి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై సుమారు అర కిలోమీటరు పొడవునా 3 అడుగుల ఎత్తున వర్షపునీరు ప్రవహిస్తున్నది. వర్షపునీటిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో తెల్లవారుజాము నుంచి ఉదయం 11గంటల వరకు విరామం లేకుండా భారీ వర్షం పడింది. మళ్లీ సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం పడుతూనే ఉంది. ఆర్టీసీ కాంప్లెక్స్‌పరిసరాలు జలమయంగా మారాయి. మండల గ్రామాలు చిత్తడిచిత్తడిగా మారి పౌరజీవనానికి ఇబ్బంది తప్పలేదు.

జగ్గంపేట: జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో వర్షం దంచి కొడుతుంది. జగ్గంపేట నాలుగు రోడ్ల జంక్షన్, సినిమాహాలు సెంటర్‌లో భారీగా వర్షపు నీరు చేరింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం పర్యవేక్షణ కోసం జగ్గంపేట డివిజన్ స్థాయిలో 24గంటలు పని చేసే కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు. 94906 10097 విద్యుత్ వినియోగదారులు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

తుని రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తుని 24వ వార్డు వీరవరపు పేటలో 110 ఏళ్ల చరిత్ర కలిగిన రామాలయం నేల కొరిగింది. ఆలయం కూలే సమయంలో దగ్గరలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని ఆ ప్రాంతవాసులు చెప్పారు. మండలంలో గవరపేట, హంసవరం, చామవరం, ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం గ్రామాల్లో వరి, పత్తి కూరగాయల పంటలు నీట మునుగుతున్నాయి.

సామర్లకోట: సామర్లకోట మండలం, పరిసర ప్రాంతాల్లో గత 24 గంటలుగా ఎడతెరిపిలేకుండా వర్షాలతో లోతట్టుప్రాంతాలు పూర్తిగా నీటముంపులోకి చేరాయి. పట్టణ శివారు వరి పొలాల్లో సుమారు 3 అడుగుల ఎత్తుల నీరు చేరింది. సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ సమీపాన రోడ్డుకు అవరోధంగా భారీ వృక్షం నేలకూలింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మెట్టలో సాగులో ఉన్న కరపెండలం దుంప పంటకు ఈ వర్షాలు ఎంతోమేలు చేకూరుస్తామని రైతులు చెప్పారు.

కరప: 2రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు, వీధులు వర్షంనీటితో నిండిపోవడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. కరప ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాలు, హైస్కూళ్ల ఆవరణలు ముంపుకు గురయ్యాయి.

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీరు పోయే మార్గం లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే రహదారులపై గుంతల్లో నిలిచిపోతుంది. మండలంలోని సిరిపురం, పేరవరం గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగి, వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది.

కొత్తపల్లి: గత 2రోజులుగా వర్షాలకు మండలంలో కొమరగిరి, గోర్స గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో వరిపంట నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే రీతిలో వర్షం మరో 2రోజులు కురిస్తే మరిన్ని పంటపొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

తీరంలో ఎగసిపడుతున్న అలలు



తొండంగి, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా శనివారం తొండంగిలోని తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి గాలులు వీస్తున్నాయి. మత్స్యకారులులను వేటకు వెళ్ళవద్దంటూ అధికారులు సూచించారు. అద్దరిపేట నుంచి చోడిపల్లి పేట వరకూ ఉన్న తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ మురార్జీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కొమ్మనాపల్లిలో సుమారు 300 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ఏ.కొత్తపల్లి ఆవ ప్రాంతంలో పొలాలు నీటమునిగాయి. 6.4 ఎంఎం వర్షపాతం నమోదయ్యింది.

పెరుగుతున్న 'పంపా' నీటిమట్టం

అన్నవరం, ఆగస్టు 31: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంపా రిజర్వాయిర్ నీటిమట్టం క్రమేపి పెరుగుతుంది. రిజర్వాయిర్ గరిష్ట నీటిమట్టం 105 అడుగులు కాగా ప్రస్తుతం 98.3 అడుగులకు చేరింది. అయితే ఎగువప్రాంతాల నుంచి వర్షపు నీరు రిజర్వాయర్‌కు చేరుతుండడంతో అంతే నీటిని పంపా వరదగేట్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అయితే ఈ నీటిమట్టం ఆదివారానికి వంద అడుగులు దాటవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.



జలకళతో తాండవిస్తున్న పంపా రిజర్వాయర్

ఇంటింటా పింఛన్ల పంపిణీ

పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కాకినాడలో దివ్యాంగురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే



కోటనందూరులో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య



పిఠాపురంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్

కాకినాడ సిటీ, ఆగస్టు 31: ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీతో అవ్వతాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. శనివారం చేపట్టిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా జోరు వానలో 39వడివిజన్ రామారావుపేట చీడీలపోర ప్రాంతంలో మంచానికే పరిమితమైన ఓ మానసిక దివ్యాంగురాలికి దివ్య ఇంటికి ఎమ్మెల్యే స్వయంగా సచివాలయ సిబ్బందితో కలిసి వెళ్లి పెన్షన్ అందజేశారు. చీడీలపోర చుట్టుపక్కల ఉన్న వృద్ధులకు ఎమ్మెల్యే పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు పాల్గొన్నారు. 28వ డివిజన్‌లో మాజీ మేయర్ సుంకర పావని పెన్షన్‌దారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. డివిజన్‌లో గల కిడ్నీ డయాలసిస్ బాధితురాలు గ్రంధి లక్ష్మీకుమారి ఇంటికి స్వయంగా వెళ్లి రూ.10వేలు పెన్షన్ అందజేశారు. హార్ట్ ఎటాక్‌తో చికిత్స పొందుతున్న పెన్షన్‌దారుడు తాతపూడి భీమరాజుకు 24వ డివిజన్ ఇన్‌చార్జి పాలిక నాని, సచివాలయ సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. అనారోగ్యంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పెన్షన్‌దారురాలు మారుపిల్లి సీతకు 10వ డివిజన్ ఇన్‌చార్జి ఎరిపిల్లి అబ్బాయి, సచివాలయ సిబ్బంది ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు. 11వ డివిజన్‌లో టీడీపీ నేత కడలి వెంకటరమణ పెన్షన్ అందజేశారు.

పిఠాపురం: సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. పిఠాపురం 24,5వ వార్డుల్లో ఆయన ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు సొమ్ములు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, మునిసిపల్ కమిషనరు నామా కనకారావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట నీలమ్మ చెరువు వద్ద సామర్లకోట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీవిద్య నేతృత్వంలో ఏర్పాటుచేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరై జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఫించన్ సొమ్ములు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ శనివారం సాయంత్రం నాటికి 95 శాతం పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య చెప్పారు.

పిఠాపురం/గొల్లప్రోలు: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా ఉదయం 5.30గంటలకే సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాల పరిధిలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది గొడుగులు, రెయిన్‌కోట్లు వేసుకుని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 60శాతంపైగా పింఛన్లు అందజేశారు. వారిని వృద్ధులు అభినందించారు.

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్: గొల్లప్రోలు మండలం చేబ్రోలు, పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ మొత్తాలను అందజేశారు. టీడీపీ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, చేబ్రోలు పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి వీరబాబు, దొరబాబు, పిఠాపురం రూరల్ నాయకులు బర్ల అప్పారావు, సకుమళ్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: తుని పట్టణం, మండలంలో డి.పోలవరం గ్రామంలో తుని ఎమ్మెల్యే యనమల దివ్య పెన్షన్లు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత యనమల రాజేష్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, ఎన్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, పలకా సోమేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ గంట్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: తుని ఎమ్మెల్యే యనమల దివ్య పెరుమాళ్ళపురం పంచాయితీ బుచ్చియ్యపేట, చోడిపల్లి పేట గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేసారు. టీడీపీ నేతలు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ, జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకట రమణ, టీడీపీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, మహంకాళి,కాలి బోయిన చంద్రరావు,సాధనాల నూకరాజు పాల్గొన్నారు.

గండేపల్లి: మల్లేపల్లిలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పింఛన్లు పంపిణీ చేశారు. ముందుగా పాతూరు సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, మారిశెట్టి భద్రం, దొమ్మా శ్రీను, దిడ్డి శ్రీను, అడబాల రామాంజనేయులు పాల్గొన్నారు.

జగ్గంపేట: సచివాలయ, పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఫించన్లు పంపిణీ చేశారు. జగ్గంపేట మండలం 16 గ్రామ పంచాయతీల్లో 21 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ జరిగింది.

కోటనందూరు: వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే యనమల దివ్య కోటనందూరు, డి.పోలవరం గ్రామాల్లో పింఛన్లు అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, పెంటకోట సత్యభాస్కరరావు, లోవ ఛైర్మన్ గొర్లు అచ్చియ్యనాయుడు డి.చీరంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, రుత్తల శ్రీనివాస్ ఉన్నారు.

రౌతులపూడి: శృంగవరం, మూలగపూడిలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పెన్షన్లు పంపిణీ చేశారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ యామల సురేష్, మాజీ ఎంపీటీసీ వాసం సాంబశివ, లొండా దేవుళ్లు, అల్లు నూకరాజు, శీరంరెడ్డి లోవరాజు, పి.రమణ పాల్గొన్నారు.

కరప: మండలవ్యాప్తంగా అధికారులు శనివారం సాయంత్రానికి 10,680మందికి పింఛన్లను అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు సోమవారం సొమ్ములందిస్తామని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలో పింఛన్ల పంపిణీ 95శాతం పూర్తయింది. ఉత్తరకంచిలో సర్పంచ్ మంతెన వెంకట రమణ (శ్రీను), లంపకలోవలో సర్పంచ్ పంది మణికుమారి దొరబాబు ఫించన్ల పంపిణీ చేపట్టారు.

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి నేతృత్వంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఫించన్లు పంపిణీ చేశారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా శామ్యూల్ జాన్



శామ్యూల్ జాన్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 31: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పి.శామ్యూల్ జాన్‌ను నియమిస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం ఏపీఎస్పీ 1వ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిపై కమాండెంట్‌గా శుక్రవారం విధుల్లో చేరిన పి.సోమశేఖరరావు శనివారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శామ్యూల్ జాన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పాట్నా ఎయిమ్స్‌లో సీటు



శ్రీ రాజా గాంధర్వ

గొల్లప్రోలు, ఆగస్టు 31: పాట్నా ఎయిమ్స్‌లో గొల్లప్రోలుకి చెందిన కొశిరెడ్డి శ్రీ రాజా గాంధర్వ పీజీ సీటు సాధించారు. గాంధర్వ రాజానగరంలోని జీఎస్ఎల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివి ఉత్తీర్ణులయ్యారు. ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా పాట్నాలోని ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎనస్థీషియా పీజీలో ఉచిత సీటు లభించింది. గాంధర్వను తల్లిదండ్రులు కొశిరెడ్డి శ్రీను, మణిలు, మావయ్య సుందర వీర్రాజు, పట్టణ వాసులు అభినందించారు.

ఏడుగురు బాలికలు డిశ్చార్జి

ఏలేశ్వరం, ఆగస్టు 31: పట్టణంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికలు 7మందిని డిశ్చార్జి చేశారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ శైలజ శనివారం మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించడంతో అస్వస్థతకు గురైన బాలికలు త్వరగానే కోలుకున్నారని, ఇంకా 4మంది చిక్సిత పొందుతున్నారన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 31: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలో జగ్గంపేట రహదారిలో నిర్వహించిన వనం మనం కార్యక్రమంలో ఆయన శనివారం మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం బారి నుంచి కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కాలుష్యం కారణంగా అనేక దుష్ప్రభావాలు కలుగుతున్నాయని, మనవంతు బాధ్యతగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం సైతం పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తూ మొక్కలు సరఫరా చేయడం చేస్తుందన్నారు. స్థానిక 26,28 వార్డుల్లో పలువురికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), టీడీపీ నేతలు రాజాసూరిబాబు రాజు, మహ్మద్ అరీఫ్ అలీ, తూతిక రాజు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి పాల్గొన్నారు.

రోడ్డు మెరక చేసిన 'టోల్‌ప్లాజా'

కిర్లంపూడి, ఆగస్టు 31: మండలంలోని కృష్ణవరం గ్రామంలోని ఎస్సీకాలనీ రోడ్డుపై టోల్‌ప్లాజా యాజమాన్యం వేస్ట్ మెటీరియల్ వేసి మెరక చేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై నుంచి వర్షపునీరు ఎస్సీకాలనీలోకి రావడంతో ముం పునకు గురవుతుంది. దీంతో గత నెల 25వ తేదీన కృష్ణవరం టోల్‌గేట్ వద్ద ఎస్సీ కాలనీ వాసులు, కాకినాడ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొదిరెడ్ల సుబ్బారావు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దీనిపై స్పందించిన టోల్ ప్లాజా మేనేజర్ సుబ్బారావుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో శనివారం ఎస్సీకాలనీలో రోడ్డు మెరక చేశారు.

గురుకుల వసతిగృహాన్ని పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



రౌతులపూడి, ఆగస్టు 31: ఎ.మల్లవరంలో సాంఘిక సంక్షేమ గురుకుల వసతిగృహాన్ని ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన శనివారం పరిశీలించారు. వంటశాల, తరగతి గదులు, మరుగు దొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సక్రమంగా విద్యనభ్యసించాలని కోరారు. వసతిగృహం ఆవరణలో అపారిశుధ్యం ఉండడంపై సిబ్బందిని ప్రశ్నించారు. మరుగుదొడ్లు శుభ్ర పరిచే సిబ్బంది తక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడు తున్నామని విద్యార్థులు తెలిపారు. సమస్యల తెలుసుకున్న భా వన ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు చెప్పారు.